సాక్షి
జోగులాంబ గద్వాల
శనివారం । 30 । నవంబర్ । 2024



విద్యా విధానంలో మార్పులు

విద్యావిధానంలో మార్పులు తెస్తామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు.

వివరాలు 10లో ▸



అభివృద్ధిలో..

కొల్లాపూర్ అభివృద్ధిలో అందరం భాగస్వాములం అవుదామని వక్తలు పిలుపునిచ్చారు.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.1 /14.6

ఉదయం, సాయంత్రం చలి ఉంటుంది. కొద్దిమేర ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

అమ్మవారి చీరల వేలంలో కొత్త కోణం

గద్వాల: జమ్ములమ్మ అమ్మవారి చీరల వేలంలో కొత్త కోణం వెలుగు చూసింది. గుడ్‌విల్‌కు వేరేవారికి విక్రయించినట్లు తెలుస్తుంది. మూడు రోజుల క్రితం జమ్ములమ్మ అమ్మవారి ఉత్సవాల టెంకాయలు, కొబ్బరిచిప్పలు, చీరలకు సంబంధించి అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. అయితే టెంకాయల వేలం పాటలో కాంట్రాక్టర్లు సిండికేట్‌గా మారి గుడ్‌విల్ రూపంలో పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుని, ఆలయ ఆదాయానికి గండి కొట్టిన విషయం తెలిసిందే. అమ్మవారి చీరల వేలాన్ని రూ.3.54 లక్షలకు పాట పాడి సొంతం చేసుకున్నారు. బినామీ పేరుతో కొంతమంది ఆలయ కమిటీ మాజీ నాయకులు వేలాన్ని సొంతం చేసుకున్నట్లు సమాచారం. ఆ నాయకులు శుక్రవారం అనధికారికంగా వేలం నిర్వహించి లక్ష రూపాయల గుడ్‌విల్‌కు చీరల వేలాన్ని మరొకరికి అమ్ముకున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. వేలం పాటలో నాయకులు అనుసరించిన తీరును ప్రజలు విమర్శిస్తుడగా.. ఈ విషయంపై వివరణ కోసం ఆలయ ఈఓ పురందర్‌కుమార్‌కు ఫోన్ చేయగా ఆయన లిఫ్ట్ చేయలేదు.

గెలుపు కన్నా క్రీడా స్ఫూర్తి మిన్న



గద్వాల: ఆటల్లో గెలుపు కన్నా క్రీడా స్ఫూర్తి గొప్పది.. దానికి లోబడే క్రీడాకారులు వ్యవహరించాలి అని అడిషనల్ కలెక్టర్ నర్సింగరావు అన్నారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు శుక్రవారం ఉత్సాహంగా సాగాయి. స్థానిక మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించినపుడే వారు ఆ రంగంలో ఉన్నత శిఖరాలకు చేరగల్గుతారని అన్నారు. కృషితో పాటు పట్టుదల ఉంటే విజయాలు సాధ్యపడుతాయని చెప్పారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. రానున్న కాలంలో క్రీడారంగం ప్రముఖంగా వెలుగొందాలని ఆకాంక్షించారు. క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ కాంతమ్మ, బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి రమేష్‌బాబు, డీవైఎస్‌ఓ బీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు



గద్వాల/ఎర్రవల్లి: జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో చివరి కార్తీక శుక్రవారాన్ని పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణానదిలో స్నానాలు ఆచరించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో శివాలయం, కోదండరామస్వామి ఆలయంతో పాటు అభయాంజనేయస్వామి ఆలయాలను దర్శించుకొన్నారు. ఆయా ఆలయాల ముందు, కృష్ణానది దగ్గర దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలను నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే, జ్ఞాన సరస్వతి ఆలయంలో అర్చకులు అభిషేకం, కుంకుమార్చన పూజలు చేశారు.

ఎర్రకొండలో వెలసిన శివలింగానికి..

గద్వాల పట్టణ శివారులోని కృష్ణానది మధ్యలో ఎర్రకొండపై వెలిసిన శివలింగం, శ్రీపూర్ణ లింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అఖండ జ్యోతిని మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ దంపతులు వెలిగించారు.



ధాన్యం తేమను పరిశీలిస్తున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, వంశీకృష్ణ, పర్ణికారెడ్డి తదితరులు

వైభవంగా రైతు పండుగ

రెండో రోజు పోటెత్తిన రైతాంగం

- వివిధ జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన అన్నదాతలు
- స్టాళ్లను పరిశీలించిన మంత్రులు ఉత్తమ్, తుమ్మల
- ప్రకృతి వ్యవసాయంపై ఆదర్శ రైతులు, శాస్త్రవేత్తల సూచనలు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకుంటున్న సందర్భంగా పాలమూరు జిల్లాలో ఏర్పాటు చేసిన రైతు పండుగ కార్యక్రమాన్ని అన్నదాతల నుంచి విశేషస్పందన వస్తోంది. 28న ప్రారంభమైన రైతు పండుగ కార్యక్రమం రెండో రోజు శుక్రవారం వైభవంగా కొనసాగింది. వ్యవసాయ శాఖతో పాటు అనుబంధ సంస్థల ఆధ్వర్యంలో రైతు పండుగ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, భువనగిరి, సూర్యాపేట తదితర జిల్లాల నుంచి రైతులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వ్యవసాయ ఉత్పత్తులు, యాంత్రీకరణ, చిరుధాన్యాలు, మత్స్య సంపద, పశు సంపద, ఉద్యాన తోటలతో పాటు వ్యవసాయ అనుబంధ యాంత్రీకరణ, వివిధ రకాల పంటల సాగుతో పాటు మార్కెటింగ్ వంటివాటిపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు ఆయా శాఖలు, సంస్థలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాల నుంచి రైతులు వచ్చేందుకు ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. రైతు పండుగలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు కల్పించారు. రెండో రోజు రైతు పండుగలో రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, వంశీకృష్ణ తదితరులు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజన వేషధారులు నిర్వహించిన సాంస్కృతిక, ఇతరత్రా కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.



డ్రోన్ యంత్రాన్ని పరిశీలిస్తున్న రైతులు

రైతు సంక్షేమమే ప్రాధాన్యం: మంత్రి ఉత్తమ్

అప్పుల పాలైన రాష్ట్రంలో ఇబ్బందులున్నప్పటికీ రైతు సంక్షేమమే మొదటి ప్రాధాన్యతగా ముందుకెళుతున్నామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన హామీ ప్రకారం మాట తప్పకుండా ఆరు నెలల్లో రూ.18వేల కోట్ల రుణాలు మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా అభివృద్ధి విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకెళుతుందన్నారు. ఈ వానాకాలంలో చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా వరి పంట దిగుబడి వచ్చిందని, 153 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండించి రూ.40 వేల కోట్ల ఆదాయాన్ని రైతులు పొందారని పేర్కొన్నారు.

లాభసాటిగా మార్చాలన్నదే లక్ష్యం: మంత్రి తుమ్మల

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలన్నదే మా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. పామాయిల్ సాగుతో రైతులు అధిక లాభాలు ఆర్జించవచ్చని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలకు నిలబడే పంటలు సాగు చేస్తే భవిష్యత్‌లో మేలు జరుగుతుందని, ఆయిల్‌పాం పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందవచ్చని సూచించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వచ్చే సంవత్సరం నాటికి రెండు ఆయిల్‌పాం పరిశ్రమలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. రైతులకు నిజం చెప్పి న్యాయంగా చేస్తామని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరారు.

ప్రాధాన్యత క్రమంలో ప్రాజెక్టులు పూర్తి



మాట్లాడుతున్న రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి, వీర్లపల్లి శంకర్, కసిరెడ్డి నారాయణరెడ్డి తదితరులు

అవసరమైతే నెలవారీగా బడ్జెట్ కేటాయింపు

- రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ అధికారులతో సమీక్ష

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, రాష్ట్రస్థాయి నీటి పారుదల శాఖ అధికారులు, ఉమ్మడి జిల్లాలోని ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూరాల, నెట్టెంపాడు, పాలమూరు, కల్వకుర్తి తదితర అన్ని ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ఇందుకుగాను అవసరమైతే నెలవారీగా బడ్జెట్ కేటాయిస్తామన్నారు. పాలమూరు- రంగారెడ్డితోపాటు అన్ని ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో ఫాస్ట్ ట్రాక్‌లో పూర్తి చేసేందుకు ముందుకు వెళ్తామన్నారు.

⇨ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి మాట్లాడుతూ ఆర్డీఎస్ కింద 18 టీఎంసీల నీటి నిల్వకు గాను కేవలం 5,6 టీఎంసీలు మాత్రమే వినియోగించుకుంటున్నారన్నారు. ఈ ప్రాజెక్టు కింద చేపట్టిన రిజర్వాయర్ల పూర్తితోపాటు పూర్తి సామర్థ్యంలో నీరు వినియోగించుకునేలా చూడాలన్నారు. అలాగే జూరాల 16 టీఎంసీల నీటి సామర్థ్యం ఉందని, ఇందుకోసం పూడికతీత చేపట్టాలని కోరారు.

⇨ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్‌ను త్వరగా పూర్తిచేస్తే సగం మహబూబ్‌నగర్ జిల్లాకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు.

⇨ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ పాలమూరు- రంగారెడ్డి కింద లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ చేపట్టినా కనీసం భూ సేకరణకు కూడా బడ్జెట్ కేటాయించలేదన్నారు. ప్రత్యామ్నాయ మార్గంలోనైనా షాద్‌నగర్ నియోజకవర్గానికి సాగునీటి సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

⇨ జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఉదండాపూర్ రిజర్వాయర్‌లో భాగంగా ఆర్‌అండ్‌ఆర్‌కు కేటాయించిన రూ.47 కోట్లు వెంటనే విడుదల చేయాలని కోరారు.

⇨ మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సంగంబండ, బూత్పూర్ రిజర్వాయర్ల కింద 9 గ్రామాలు ముంపునకు గురి కాగా.. 4 గ్రామాలకు సంబంధించి నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సంబంధిత ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఆయా గ్రామాలను సందర్శించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

⇨ పేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి మాట్లాడుతూ గ్రావిటీ ద్వారా జాయమ్మ చెరువుకు నీరు తీసుకువస్తే సాగునీరు అందుతుందని, వీలైతే లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించే విషయం ఆలోచించాలని కోరారు.

⇨ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ టెండర్లు పూర్తి అయ్యాయని, అయితే ప్రస్తుతం ఏదుల రిజర్వాయర్ నుంచి కాకుండా, నార్లాపూర్ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించాలని పేర్కొన్నారు.

⇨ వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ కేఎల్‌ఐ కింద చివరి ఆయకట్టుకు నీరు రావడం లేదని, కాంట్రాక్టు కంపెనీ పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి దృష్టికి తెచ్చారు.

⇨ దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కోయిల్‌సాగర్ ఆయకట్టు పెంపునకు సంబంధించి ప్రభుత్వం రూ.92 కోట్లు మంజూరు చేసిందని, అయితే టెండర్ ప్రక్రియలో న్యాయపరమైన సమస్యల కారణంగా అది ఆగిపోయిందని చెప్పారు.

⇨ కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ కేఎల్‌ఐ డీ-7, 8, 82 కింద పనులు చివరి దశలో ఉన్నాయని, అందువల్ల ఆ ఏజెన్సీ తోనే పనులు పూర్తి చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. డిండి ప్రాజెక్టులో భాగంగా చారకొండ, అచ్చంపేట, కల్వకుర్తి ప్రాంతాలకు నీరిచ్చే గోకారం, ఎర్రవల్లి రిజర్వాయర్లు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తామని గతంలో ప్రకటించిందని, గోకారం చెరువు రిజర్వాయర్ కెపాసిటీపై స్పష్టత ఇవ్వాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు రాహుల్ బొజ్జ, ప్రశాంత్ జీవన్ పాటిల్, కలెక్టర్ విజయేందిర, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాలోని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు, ఎస్‌ఈలు, అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు సర్వం సిద్ధం



అమిస్తాపూర్ వద్ద సీఎం బహిరంగసభకు ఏర్పాట్లు

- 2 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు
- దాదాపు లక్ష మంది రైతులు హాజరయ్యే అవకాశం
- పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ సత్యనారాయణ

మహబూబ్‌నగర్ క్రైం: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా రైతు పండుగ సదస్సుకు శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు సంబంధించి వ్యవసాయ యాంత్రీకరణ.. నూతన సాంకేతిక విధానాలు, ప్రకృతి వ్యవసాయం వంటి తదితర అంశాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించిన అనంతరం అక్కడే మైదానంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ ట్రాఫిక్ దారి మళ్లింపుతో పాటు పార్కింగ్ స్థలాల ఏర్పాట్లు పూర్తి చేశారు. సభకు వచ్చే వాహనాలతో పాటు వీవీపీల వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ జోన్ కల్పించారు.

❒ అమిస్తాపూర్‌లోని మైదానంలో నిర్వహించే బహిరంగ సభాప్రాంగణాన్ని అందంగా ముస్తాబు చేశారు. లక్ష మందికి పైగా రైతులు హాజరయ్యే అవకాశం ఉండడంతో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. బందోబస్తులో భాగంగా 8 మంది ఎస్పీలు, 9 మంది శిక్షణ ఐపీఎస్‌లు, 8 మంది ఏఎస్పీలు, 20 మంది డీఎస్పీలు, 40 మంది సీఐలు, ఆర్‌ఐలు, 95 మంది ఎస్‌ఐలు, 380 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 680 మంది కానిస్టేబుళ్లు, 180 మంది మహిళా కానిస్టేబుళ్లు, 325 మంది హోంగార్డులు, 267 మంది సిటీ ట్రాఫిక్ పోలీసులు బందోబస్తులో భాగంగా విధుల కేటాయించారు.

❒ భూత్పూర్ మీదుగా మహబూబ్‌నగర్ వెళ్లే వాహనాలను అన్నింటిని శనివారం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 8 గంటల వరకు జడ్చర్ల మీదుగా డైవర్షన్ తీసుకుని మహబూబ్‌నగర్‌కు చేరుకోవాల్సి ఉంటుంది. ఇక మహబూబ్‌నగర్ భూత్పూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల వైపు వెళ్లే వాహనాలు బైపాస్ మీదుగా జడ్చర్ల నుంచి జాతీయ రహదారిపై ట్రాఫిక్ డైవర్షన్ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి..

❒ సీఎం పర్యటన నేపథ్యంలో మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ, ఎస్పీ జానకి శుక్రవారం ఉదయం నుంచి బందోబస్తు విధుల కేటాయింపు, పర్యటన ప్రదేశం, హెలీప్యాడ్ స్థలం, పార్కింగ్ స్థలాలు పరిశీలించారు. ఆ తర్వాత అమిస్తాపూర్ సమీపంలోని వాసవీ కన్వెన్షన్ హాల్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తుపై ఐజీ సూచనలు చేశారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది తమ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. సీఎం పర్యటన పూర్తిగా ప్రశాంతంగా జరిగేలా కృషి చేయాలని, విభాగాల వారీగా కేటాయించిన బాధ్యతలను బాధ్యతగా నిర్వహించాలని చెప్పారు. భద్రతా ఏర్పాట్లలో రైతులు, ప్రముఖులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని, కమ్యూనికేషన్ వ్యవస్థను బలోపేతం చేసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



పార్కింగ్ స్థలం పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ, ఎస్పీ జానకి తదితరులు

పక్కాగా మెనూ అమలు చేయండి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల: వసతిగృహాలు, కేజీబీవీల్లో మెనూ పక్కాగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రాష్ట్ర మైనారిటీస్ రెసిడెన్షియల్ గరల్స్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రెసిడెన్షియల్ పాఠశాల మొత్తం కలియతిరిగారు. విద్యార్థులకు రోజు వడ్డిస్తున్న భోజనం, వంటసామగ్రి, కిచెన్‌షెడ్, స్టాక్ గదులు, స్టోర్‌రూంలో నిల్వ ఉంచిన బియ్యం, గుడ్లు, కూరగాయలు, పప్పు ఇతర నిత్యావసరాల నాణ్యతను వాటి కాలపరిమితిని పరిశీలించారు. మెనూ ప్రకారమే విద్యార్థులకు భోజనం అందజేస్తున్నారా.. లేదా.. అని ఆరా తీస్తూ ఈరోజు మెనూ ప్రకారం ఏం వంటచేశారని వంట సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కిచెన్‌షెడ్, వంటపాత్రలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నాసిరకం బియ్యం, నిత్యవసరాలు, కూరగాయలు సరఫరా చేస్తే వాటిని తిరస్కరించి నాణ్యమైన వస్తువులనే తీసుకోవాలన్నారు. మెస్‌కమిటీ ఏర్పాటు చేసి కమిటీ సభ్యులు ప్రతిరోజు ఆహార పదార్థాలు, వాటి నాణ్యతను పరిశీలంచాలన్నారు. ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ భవాని పాల్గొన్నారు.

తెలంగాణ సాధకుడు కేసీఆర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్

గద్వాల: తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ చచ్చుడో అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే విజయుడు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో దీక్షా-దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వారు మాట్లాడుతూ భాష పేరిట తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో విలీనం చేసిన తరువాత సీమాంధ్ర పాలకుల హయాంలో పూర్తి నిర్లక్ష్యానికి గురవడమే కాకుండా, ఇక్కడి సంపదను పూర్తిగా దోచుకున్నారన్నారు. అదేవిధంగా నీళ్లు, నిధులు, నియమకాలలో కూడా తెలంగాణ ప్రాంతానికి పూర్తి అన్యాయం జరిగిందన్నారు. ఈనేపథ్యంలోనే ప్రత్యేక రాష్ట్ర సాధనకు కేసీఆర్ ఒక్కడే ముందుకు కదిలాడని, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తూ, ఆర్డీఎస్ కోసం పాదయాత్రలు చేస్తూ మలిదశ తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసిపడేలా చేశాడని వివరించారు. నవంబర్ 29న ఆమరణ దీక్షకు దిగడంతో దిగివచ్చిన పాలకులు ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, అయితే అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడచిన ఏడాది కాలంగా ప్రజలను అన్ని రకాలుగా మోసం చేసిందన్నారు. ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేయకుండా ప్రజలను నట్టేటా ముంచిందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి

పదేళ్లలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్ అనంతరం కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచిందని మాజీ సాట్స్ చైర్మన్ ఆంజనేయగౌడ్ అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తీరని అన్యాయం చేసిందని దుయ్యబ బట్టారు. రైతాంగాన్ని పూర్తిగా అన్యాయం చేసిందని ఆరోపించారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందన్నారు. విష్ణు వర్ధన్‌రెడ్డి, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, గంజిపేట రాజు, మోనేష్, విజయ్‌కుమార్, బాసు హనుమంతు, శ్యామల, కుర్వ పల్లయ్య పాల్గొన్నారు.

అన్నదాతలకు ఆర్థిక తోడ్పాటు

- రైతు పండుగలో ఆకట్టుకున్న యంత్ర పరికరాలు, మేలుజాతి పశు సంపద
- రెండోరోజు కిటకిటలాడిన స్టాళ్లు.. వేలాదిగా తరలివచ్చిన రైతన్నలు
- ఆసక్తిగా వివరాల సేకరణ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాలమూరులో నిర్వహిస్తున్న రైతు పండుగ సంబరాలు రెండోరోజు అంగరంగ వైభవంగా కొనసాగాయి. భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న రైతు పండుగ సంబరాల్లో రెండోరోజు శుక్రవారం రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డితోపాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రైతు పండుగ సంబరాల్లో ఏర్పాటు చేసిన వ్యవసాయ అనుబంధ స్టాళ్లను రాష్ట్ర మంత్రులు సందర్శించి పరిశీలించారు. రైతు పండుగ సంబరాలకు వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులతో మాట్లాడుతూ కలియదిరిగారు. స్టాళ్ల వద్ద నిర్వాహకులు రైతులకు వ్యవసాయ యాంత్రీకరణ, ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. సంబరాల్లో వ్యవసాయ అనుబంధ యాంత్రీకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



■ ఇది సాధారణ పొలంలో వరి నాటు వేసే యంత్రం. దీని విలువ రూ.4.20 లక్షలు. అతితక్కువ ఖర్చుతో ఈ యంత్రం ద్వారా వరినాట్లు వేసుకోవచ్చు. ఎకరాకు రెండు లీటర్ల పెట్రోల్ ఖర్చుతో వరినాట్లు వేసుకోవచ్చు. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. దీని ద్వారా నాటు వేస్తే పంటకు గాలి తగిన మోతాదులో తాకడం, కోతలు సునాయసంగా జరుగుతుంది. పంటకు పురుగు పట్టకుండా ఉంటుంది. సూర్యరష్మి తాకి రోగాలు సోకవు. ప్రస్తుతం వరి నాట్లు వేసేందుకు కూలీల ఖర్చు తడిసి మోపెడవుతున్నాయి. రైతు పండుగలో ఈ యంత్రాన్ని ప్రదర్శనకు పెట్టడంతో రైతులు వరి నాటు యంత్రాన్ని తిలకించి యంత్రం పని తీరు గురించి తెలుసుకున్నారు.



■ ఇవి నెల్లూరు మేలు జాతి గొర్రెలు. వీటి ఎత్తు 72 నుంచి 76 సెంటీమీటర్లు ఉంటాయి. పొట్టేలు బరువు 40 నుంచి 50 కిలోలు, ఆడ గొర్రెలు 25 నుంచి 35 కిలోల వరకు బరువు ఉంటాయి. నెల్లూరు జాతిలో జోడిపి, పల్లా, బ్రౌన్ అనే మూడు రకాల గొర్రెలు ఉంటాయి. జోడిపి తెలుపు లేదా నలుపు రంగులో ఉంటుంది. పెదవులు, కళ్లు, దవడ, పొట్ట కింద, కాళ్ల మీద నల్లని మచ్చలుంటాయి. పల్లా రకం పూర్తిగా తెలుపు రంగులో ఉంటుంది. తల, మెడ, నడుము, కాళ్ల మీద గోధుమ రంగు మచ్చలుంటాయి. శరీరంపై ఎలాంటి మడతలు లేకుండా ఉంటాయి. బ్రౌన్ రకం ముదురు గోధుమ రంగు లేదా ఎరుపు రంగులో ఉంటాయి. ఫార్మ్ రంగంలో గొర్రెల పంపకం చేపట్టే రైతులకు ఈ రకాల గొర్రెల ద్వారా ఎక్కువ లాభాలు పొందవచ్చు.





■ దీని పేరు బోయర్ జాతి మేక. దక్షిణాఫ్రికాకు చెందిన ఈ మేక తెలుపురంగు శరీరం, గోధుమ రంగు తలతో ఉంటుంది. మగ మేక 115 కిలోలు, ఆడ మేక వంద కిలోల వరకు పెరుగుతుంది. ప్రతి రెండేళ్లకు మూడు ఈతలు ఈనుతుంది. పశు సంపదలో ఈ మేక ఎదుగుదల గమనీయంగా ఉంటుంది. రైతులు ఈ మేకల పెంపకం ద్వారా ఎక్కువగా ఆర్థిక లాభాలు ఆర్జించవచ్చు. ఫార్మ్ రంగంలో బోయర్ జాతి మేకల పెంపకం ద్వారా రైతులు ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చు.



■ వీటి పేరు మేలు జాతి సాహివాల్ దూడలు. పాలమూరు జెనెటిక్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్న మేలు జాతి ఆవుల ద్వారా ఈ దూడలు జన్మించాయి. పిండ మార్పిడి విధానం (ఈటీ) ద్వారా ఈ దూడలను సృష్టించారు. ఈ దూడలు ఒకే ఆవు నుంచి తీసిన అండాల నుంచి ఒక సంవత్సరంలో జన్మించిన మేలు జాతి దూడలు. పిండ మార్పిడి ద్వారా జన్మించిన దూడల ద్వారా మేలు రకం పశు సంపదను వృద్ధి చేసుకొని తద్వారా రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చు.



■ సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్‌పై అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్టాల్ రైతు పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రకరకాల పూలు, పండ్లు, కూలగాయల మొక్కలు మిద్దె తోటల సాగు మనిషి ఆహారానికి ఉపయోగపడే విధానంపై నిర్వాహకులు అవగాహన కల్పించారు. తమ ఇంటి మిద్దెలపై, బాల్కనీలలో కుటుంబానికి అవసరమయ్యే కూరగాయలు, పండ్లు పండించుకునే సులువైన విధానాలను వివరించారు. గృహావసరాలు తీర్చుకునేందుకు ఈ పద్ధతి బాగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సీటీజీ వాట్సప్ గ్రూప్‌ను 30 మందితో తయారు చేయగా ప్రస్తుతం 72 గ్రూపులు, 70 వేల మంది సభ్యులతో కొనసాగుతుందని చెప్పారు. మిద్దె తోటలు, బాల్కనీలలో పెంచే మొక్కలకు ఏమైనా వైరస్ లాంటివి వస్తే సీటీజీ గ్రూపులోని సైంటిస్టులు సలహాలు, సూచనలు ఇస్తారని, ఎవరి వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

రైతుపండుగలో నేటి కార్యక్రమాలు

■ ఉదయం 10 నుంచి 10.20 వరకు వ్యవసాయ యాంత్రీకరణ, అవశేషాల నిర్వహణపై రాజేంద్రనగర్ ఎఫ్ఐఎం స్కీం హెడ్ డా. పి.రాజయ్య వర్క్‌షాప్.
■ ఉదయం 10.20 నుంచి 10.40 వరకు మొక్కజొన్నలో సాంకేతిక పరిజ్ఞానంపై రాజేంద్రనగర్ ఎంఆర్‌సీ డా. ఎంవీ నాగేశ్‌కుమార్ వర్క్‌షాప్.
■ ఉదయం 10.40 నుంచి 11 వరకు బియ్యం రకాలు.. రబీ సీజన్‌లో నిర్వహణపై రాజేంద్రనగర్ ఐఆర్ఆర్ డా. సీహెచ్ దామోదర్‌రాజు వర్క్‌షాప్.
■ ఉదయం 11 నుంచి 11.30 వరకు ఔషద, సుగంధ ద్రవ్యాల తయారీపై రీసర్చ్ సైంటిస్ట్ వి.కృష్ణవేణితో రైతుల ఇంటరాక్షన్
■ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆయిల్‌పాం ఉత్పత్తి.. సాంకేతికతపై శాస్త్రవేత్త డా.బీఎస్ రావు వర్క్‌షాప్.
■ మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు పీవీఎన్ఆర్‌టీ వెటర్నరీ యూనివర్సిటీ శాస్త్రవేత్తతో లైవ్‌స్టాక్ మేనేజ్‌మెంట్, రైతులతో ఇంటరాక్షన్.
■ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 2 వరకు భోజన విరామం

– మహబూబ్‌నగర్ న్యూటౌన్

ధాన్యాన్ని వందశాతం కొనుగోలు చేయాలి

రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



వ్యవసాయ అధునాతన యంత్రాన్ని నడుపుతున్న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని వందశాతం కొనుగోలు చేసి కేంద్రాల నుంచి తరలించాలని, కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్ ఎంట్రీ వందశాతం పూర్తి చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డితో కలిసి ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులతో వానకాలం ధాన్యం సేకరణపై సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని నూటికి నూరుశాతం కేంద్రాల నుంచి తరలించాలని చెప్పారు. సన్న ధాన్యాన్ని ప్రోత్సహించాలని, రేషన్ కార్డుదారులందరికీ సన్న ధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినందున రాష్ట్రవ్యాప్తంగా 36 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం సేకరించవలసి ఉందని తెలిపారు. వనపర్తి, గద్వాల, నారాయణపేట జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం ఎక్కువగా ఉందని, తక్షణమే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేటు వ్యాపారస్తులు, మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరతో పాటు, బోనస్ కన్నా ఒక రూపాయి తక్కువకి కొనుగోలు చేయకుండా నియంత్రించాల్సిన అవసరం ఉందని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ శనివారం లోగా పెండింగ్‌లో ఉన్న రైతులకు చెల్లించాల్సిన మొత్తం చెల్లింపులు చేయాలని, అలాగే ట్యాబ్ ఎంట్రీ సైతం పూర్తి చేయాలని చెప్పారు.

■ అంతకుముందు పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ డీఎస్ చౌహాన్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ఈ వానకాలం ఇప్పటివరకు సన్న రకం, దొడ్డు రకం కలిపి రూ.333 కోట్లు విలువ చేసే 12,61,54 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 18,383 మంది రైతులు నుంచి కొనుగోలు చేసినట్లు తెలిపారు. రైతులకు ఇప్పటి వరకు రూ.216.78 కోట్లు చెల్లించామని, ఇందులో రూ.8.75కోట్లు సన్నధాన్యానికి బోనస్ చెల్లించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అనిరుధ్ రెడ్డి, వాకిటి శ్రీహరి, పర్ణికారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, మేఘారెడ్డి, వీర్లపల్లి శంకర్, వంశీకృష్ణ, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల అధికారులు, అదనపు కలెక్టర్లు మోహన్ రావు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

భర్తను హతమార్చిన భార్య

- వివాహేతర సంబంధమే కారణం
- నిందితులు రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ బుర్రి శ్రీనివాస్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ బుర్రి శ్రీనివాస్

నాగర్‌కర్నూల్ క్రైం: బిజినేపల్లి మండలంలోని కేఎల్ఐ కాల్వలో ఈ నెల 25న మృతదేహం లభించగా.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి భార్యనే ప్రియుడితో కలిసి హత్య చేసినట్లు నిర్ధారించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను శనివారం జిల్లాకేంద్రంలోని తన కార్యాలయంలో డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ విలేకర్లకు వెల్లడించారు. నాగర్‌కర్నూల్ మండలం తూడుకుర్తికి చెందిన జగదీశ్, గద్వాలకు చెందిన కీర్తి 2011లో యాదగిరిగుట్టలో ప్రేమ వివాహం చేసుకున్నారు. జగదీశ్ జిల్లాకేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వర్తించేవాడు. కీర్తి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న క్రమంలో బిజినేపల్లి మండలం గుడ్లనర్వకు చెందిన నాగరాజుతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం ఇరు కుటుంబాల్లో తెలియడంతో జగదీశ్, కీర్తి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఇదే క్రమంలో జగదీశ్‌ను అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్న కీర్తి ఈ నెల 24న గద్వాలలోని జమ్ములమ్మ ఆలయానికి తీసుకెళ్లింది. అక్కడే ప్రియుడితో తెప్పించిన కల్లులో మత్తు పదార్థం కలిపి తాగించడంతో జగదీశ్ స్పృహ కోల్పోయాడు. అక్కడి నుంచి ప్రియుడు నాగరాజు, తమ్ముడు సాయికుమార్‌తో కలిసి కారు డిక్కీలో వేసుకొని స్వగ్రామమైన తూడుకుర్తిలోని సొంత వ్యవసాయ పొలానికి తీసుకొచ్చారు. మొదట విద్యుత్ షాక్‌తో చంపాలని భావించిన అదే సమయంలో కరెంట్ లేకపోవడంతో తలపై రాయితో మోది తర్వాత గ్రామంలోని కేఎల్ఐ కాల్వలో పడేసి నీటిలో ముంచి చంపేశారు. మృతదేహం కేఎల్ఐ కాల్వలో కొట్టుకుపోయి ఈ నెల 25న బిజినేపల్లి మండలం అల్లీపూర్ వద్ద తేలడంతో పోలీసులు బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టంలో తలకు గాయాలు కనిపించడంతో భార్యను అదుపులోకి తీసుకొని విచారించగా ప్రియుడితో పాటు మరో నలుగురు కలిసి హత్య చేసినట్లు నేరం ఒప్పుకున్నట్లు డీఎస్పీ వివరించారు. హత్యకు పాల్పడిన కీర్తితో పాటు ప్రియుడు నాగరాజు, హత్యకు సహకరించిన కీర్తి తల్లి పద్మ, తమ్ముడు సాయికుమార్, శివ, సుధాకర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మరో నిందితుడు మోహన్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు చెప్పారు.

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

- రూ.12 వేల జరిమానా

మక్తల్: హత్యా నేరం రుజువు కావడంతో ఇద్దరు నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.12 వేల జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ శుక్రవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2021, మార్చి 29న మక్తల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సంగంబండ కాల్వ సమీపంలో మృతదేహం దహనం చేస్తున్నట్లు కావాలి రాము సమాచారం ఇవ్వడంతో గుర్తు తెలియని మృతదేహంగా అప్పటి ఎస్ఐ రాములు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శివకుమార్ విచారణ చేపట్టి చిట్యాలకు చెందిన ముడుమాల్ లింగమ్మ (43)గా గుర్తించారు. ఆమెకు మక్తల్‌కు చెందిన ఏలె విష్ణు, పంచదేవ్‌పాడుకు చెందిన కర్రెనోళ్ల అంజమ్మ సంతలో పరిచయమయ్యారు. లింగమ్మ ఒంటిపై ఉన్న బంగారు నగలు, వెండి వస్తువులను ఎలాగైనా దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. 2021, మార్చి 28న సాయంత్రం ముగ్గురు కలిసి సంగంబండ కాల్వ సమీపానికి వెళ్లి మద్యం తాగారు. లింగమ్మ మద్యం మత్తులో ఉండగా విష్ణు, అంజమ్మ కలిసి ఆమె తలపై బండరాయితో మోది బంగారు ఆభరణాలు, కాళ్ల కడియాలు, పట్టీలు తీసుకొని మృతదేహాన్ని కాల్చివేశారు. అప్పటి అధికారులు కోర్టులో చార్జ్‌షీట్ వేయగా ప్రస్తుత సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి, కోర్టు లైజనింగ్ అధికారి కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ అధికారులు భీరాజ్, బీర్లు కోర్టుల్లో సరైన సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టగా పీపీ ఆకుల బాలప్ప వాదనలు వినిపించి నేరం రుజువు చేశారు. దీంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ నిందితులకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసు విచారణలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అభినందించారు.

నేటి నుంచి రగ్బీ సమరం

- పాలమూరులో రెండోసారి రాష్ట్రస్థాయి టోర్నీ నిర్వహణ
- పాల్గొననున్న 10 ఉమ్మడి జిల్లాల జట్లు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు



రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ కోసం జిల్లా స్టేడియాన్ని సిద్ధం చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: పాలమూరు మరో రాష్ట్రస్థాయి క్రీడా టోర్నీకి వేదికైంది. శనివారం నుంచి వచ్చేనెల 2వ తేదీ వరకు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 రాష్ట్రస్థాయి బాలబాలికల రగ్బీ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ నిర్వహించడం ఉమ్మడి జిల్లాలో ఇది రెండోసారి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం స్టేడియంలో జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిరంజన్‌రావు, పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

■ టోర్నీలో పాల్గొనేందుకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలు మహబూబ్‌నగర్, కరీంనగర్, వరంగల్, మెదక్, ఆదిలాబాద్, ఖమ్మం, హైదరాబాద్, రంగారెడ్డి, నల్గొండ, నిజామాబాద్ నుంచి 240 మంది క్రీడాకారులతో పాటు 60 మంది అధికారులు హాజరుకానున్నారు. బాలురకు మెయిన్ స్టేడియంలోని స్విమ్మింగ్‌పూల్‌పై అంతస్తు గదులు, బాలికలకు స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో వసతి సౌకర్యంతో పాటు అక్కడే క్రీడాకారులందరికీ భోజన వసతి కల్పిస్తున్నారు.

రెండు మైదానాల్లో మ్యాచ్‌ల నిర్వహణ

మెయిన్ స్టేడియంలో రెండు మైదానాల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో రగ్బీ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. బాలుర విభాగం 12, బాలికల విభాగం 12 మ్యాచ్‌లు జరగనున్నాయి. శనివారం సాయంత్రం 4 గంటలకు జరిగే రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, డీఈఓ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారు.

టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా జట్లు..

బాలురు: శివకుమార్, నందీశ్వర్‌రెడ్డి, శివనాయక్, వరుణ్, నరహరి, తిరుమలేశ్, రాంచరణ్, రేవంత్ కుమార్, యువరాజ్, టి.పాల్, వర్షిత్, వరుణ్ తేజ, బి.వరుణ్ తేజ్, మధు, అనిల్‌కుమార్, బి.అనిల్‌కుమార్.

బాలికలు: ఉమా, చరిత, టి. శైలజ, సుచరిత, యామిని, ఉరుకుంద, రాధిక, మీనాక్షి, నిఖిత, ప్రవళిక, హర్షిత, పూజ, మానస, శ్రీకృతి, ప్రీతి.

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం...

ఈ ఏడాది జిల్లాలో ఇటీవలే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ టోర్నీని విజయవంతంగా నిర్వహించాం. రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీని కూడా అందరి సహకారంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తాం.

– శారదాబాయి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి

అన్ని ఏర్పాట్లు చేశాం

రెండోసారి జిల్లాలో రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీ నిర్వహిస్తున్నందుకు సంతోషంగా ఉంది. జిల్లాకు రగ్బీ టోర్నీ కేటాయించిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌కు కృతజ్ఞతలు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. రాష్ట్రస్థాయి రగ్బీ టోర్నీని విజయవంతంగా నిర్వహిస్తాం.

– సి.నిరంజన్‌రావు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ

బిజ్వారంలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి



అమరవాయిలో అంబులెన్స్ ఎదుట ఆందోళనకు దిగిన మృతుడి కుటుంబసభ్యులను వారిస్తున్న పోలీసులు



మృతుడు శాంతన్న (ఫైల్)

న్యాయం చేయాలంటూ కుటుంబసభ్యుల ఆందోళన

మల్దకల్: పొలం వద్ద పనిచేస్తున్న ఓ రైతు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన మండలంలోని బిజ్వారం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నందికర్ తెలిపిన వివరాలిలా.. బిజ్వారం గ్రామానికి చెందిన శాంతన్న (65)కు ఓ కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు గోకారన్న ట్రాన్స్‌కోలో పని చేస్తూ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో గోకారన్న భార్య లక్ష్మీదేవి, ఆమె సోదరులు అక్టోబర్ 15న బిజ్వారంలో ఆస్తి, తదితర వాటి విషయమై వరుసకు మామ అయిన శాంతన్న, వారి కుటుంబసభ్యులతో పంచాయతీ పెట్టారు. ఈక్రమంలో మాటామాటా పెరిగి శాంతన్నపై కోడలి బంధువులు దాడి చేయడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. అప్పట్లోనే మల్దకల్ పోలీస్‌స్టేషన్‌లో శాంతన్న ఫిర్యాదు మేరకు కోడలు లక్ష్మీదేవి సోదరులపై కేసు నమోదైంది. కాగా గురువారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన శాంతన్న అస్వస్థతకు గురికాగా వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు.

తన భర్త మృతికి వారే కారణమంటూ..

తన భర్త శాంతన్న మృతికి కోడలు లక్ష్మీదేవి సోదరులే కారణమంటూ మృతుని భార్య వెంకటమ్మ, కూతుళ్లతో కలిసి ఆందోళనకు దిగింది. మృతదేహంతో మార్గమధ్యలో అమరవాయి స్టేజీ సమీపంలో అంబులెన్స్ ఎదుట రోడ్డుపై బైఠాయించింది. తన భర్త చావుకు కారణమైన వారిని అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదంటూ వారు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా శాంతన్న మృతికి కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో బాధితులు గ్రామానికి చేరుకున్నారు. మృతుడు శాంతన్న భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నర్వ: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మండలంలోని సీపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ కురుమయ్య కథనం మేరకు.. మక్తల్‌కు చెందిన ఎడవెల్లి నర్సింహులు (24) కూలి పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. సీపూర్‌కు చెందిన ఏర్పుల భీంరెడ్డి ఇంటి నిర్మాణం చేస్తుండగా కూలీ పని కోసం వచ్చాడు. మధ్యాహ్నం పని చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. గుర్తించిన ఇంటి యజమాని చికిత్స నిమిత్తం మక్తల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. తండ్రి తిప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

హార్వెస్టర్, బైక్ ఢీ : ఒకరి దుర్మరణం

ధరూరు: హార్వెస్టర్ (వరికోత యంత్రం), బైక్ ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందిన ఘటన మండలంలోని పారుచర్ల స్టేజీ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గద్వాలకు చెందిన మేస్త్రీ వడ్డె భీసన్న (34) శుక్రవారం ఇంటి నిర్మాణ పని నిమిత్తం అలూరుకు వెళ్లి సాయంత్రం 6.30 ప్రాంతంలో బైక్‌పై తిరుగు పయనమయ్యాడు. మార్గమధ్యంలో పారుచర్ల స్టేజీ వద్ద పంట కోత ముగించుకొని గద్వాల వైపు వెళ్తున్న వరి కోత యంత్రం బైక్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

రామన్‌పాడుకు 719 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో శుక్రవారం పూర్తిస్థాయి నీటి మట్టం 1,021 అడుగులు ఉంది. ఎన్టీఆర్ కాల్వకు 710, కుడి, ఎడమ కాల్వలకు 25, వివిధ లిఫ్టులకు 391 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

శస్త్రచికిత్సలో వైద్యుల నిర్లక్ష్యం



వివరాలు సేకరిస్తున్న వైద్య, ఆరోగ్య శాఖాధికారులు

గద్వాల క్రైం: ముక్కు సమస్యతో ప్రైవేటు ఆసుపత్రికి వచ్చిన మహిళకు శస్త్ర చికిత్స చేసేటపుడు వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మత్తు ఇంజక్షన్ ఇచ్చి ఆపరేషన్ చేస్తుండగా ఆమె పరిస్థితి విషమంగా మారిన ఘటన గద్వాలలో చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, జిల్లా వైద్యశాఖాధికారుల కథనం మేరకు.. అయిజ పట్టణానికి చెందిన కవిత కొన్ని రోజులుగా ముక్కు సమస్య కారణంగా శ్వాస తీసుకునేందుకు బాధపడుతుండేది. వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి ఈ నెల 26వ తేదీన రోగి, బంధువుల సహాయంతో వెళ్లింది. వైద్యులు పరీక్షించి లోపల గడ్డ ఉందని, శస్త్ర చికిత్స ద్వారా తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. దీంతో 28న శస్త్ర చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చారు. సాయంత్రం 7గంటల సమయంలో శస్త్ర చికిత్స చేసేందుకు ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌లోకి వైద్యులు రోగిని తీసుకెళ్లారు. అక్కడ మత్తు ఇంజక్షన్ ఇచ్చారు. ట్రీట్‌మెంట్ చేసే క్రమంలో రోగి ఆరోగ్య పరిస్థితి విషమంగా మారింది. క్షణాల్లో ఫీట్స్ రావడం రోగికి మెరుగైన చికిత్స అందించాల్సిందిగా వైద్యులు రోగి బంధువులకు తెలిపారు. దీంతో రాత్రికి రాత్రే వారు కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం బయటకు రాకుండా ప్రైవేటు ఆసుపత్రి యాజమాన్యం గోప్యంగా ఉంచారు. కాగా శుక్రవారం ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో జిల్లా వైద్యశాఖాధికారులు స్పందించి రోగికి ఇచ్చిన చికిత్స, శస్త్రచికిత్స చేస్తున్న వైద్యుడి వివరాలు సేకరించారు. సంబంధిత ఆసుపత్రి యాజమాన్యానికి నోటీసులు ఇచ్చారు.

విచారణ చేపట్టాం



ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేస్తున్న క్రమంలో రోగి పరిస్థితి విషమించడంపై విచారణ చేపట్టాం. కవిత ఆరోగ్య పరిస్థితి నిలకడ ఉందని కర్నూలులోని ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు, ఆమె బంధువులు తెలిపారు. రోగికి అందించిన వైద్యం, వైద్యుడి వివరాలతో పాటు పలు రికార్డులను వైద్య శాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఆసుపత్రి యాజమాన్యంకు నోటీసులు జారీచేశాం. త్వరలో పూర్తి వివరాలు వెల్లడిస్తాం.

– సిద్దప్ప, జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారి, గద్వాల

క్లుప్తంగా...

పీఎస్ అథెంటికేషన్ దుర్వినియోగం కావొద్దు

డీఆర్డీవోలకు సెర్ప్ సీఈవో ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: చేయూత పింఛన్ల పంపిణీలో భాగంగా పంచాయతీ కార్యదర్శులు 'పీఎస్ అథెంటికేషన్'ద్వారా మంచానికే పరిమితమైన వారు, బయోమెట్రిక్ ఫెయిలైన వ్యక్తులకు మాత్రమే పింఛన్లు పంపిణీ చేసేలా చూడాలని డీఆర్‌డీవోలను.. గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) సీఈవో డి.దివ్య ఆదేశించారు. వీరికి కాకుండా ఇతరులకు ఈ పద్ధతి ద్వారా పింఛన్లు అందించినట్టు తేలితే కఠినచర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. పింఛన్ల అందజేత సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు ఈ విషయంలో స్పష్టంగా ఉన్నాయన్నారు. శుక్రవారం ఈ మేరకు డీఆర్‌డీవోలకు దివ్య లేఖ రాశారు. ఈ విషయంలో కచ్చితమైన మార్గదర్శకాలున్నా.. కొందరు పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు తమ పీఎస్ అథెంటికేషన్ ద్వారా ఇతరులకు కూడా పింఛన్ పంపిణీ చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇలా చేయడం వల్ల ఆర్థికపరమైన అవకతవకలకు దారితీసే అవకాశముందన్నారు. పీఎస్ అథెంటికేషన్ చెల్లింపునకు సంబంధించి పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు విడిగా ఓ అక్విటెన్స్ రిజిస్టర్‌ను మెయింటెయిన్ చేయాలని, అందులో పింఛనుదారుల సంతకాలు లేదా వేలిముద్రలు నమోదుచేయాలని ఆదేశించారు.

ఐటీ ఉద్యోగాలపై ప్రత్యేక ప్రసారాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ శాఖ ఆధ్వర్యంలో వీఎల్ఎస్ఐ అవేర్‌నెస్ ప్రోగ్రాం పేరిట నాలుగు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు టీ–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పీవీసీ (పాటానిక్స్ వ్యాలీ కార్పొరేషన్), టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్), ఏఎస్ఐపీ(అడ్వాన్స్‌డ్ సిస్టమ్ ఇన్ ప్యాకేజ్ టెక్నాలజీస్), టీ–సాట్ (తెలంగాణ స్కిల్ అకడమిక్ అండ్ ట్రైనింగ్) సంయుక్తంగా డిజైన్ చేసిన కోర్సులను ప్రత్యేక ప్రత్యక్ష ప్రసారాల ద్వారా అందించనున్నట్లు తెలిపారు. వీఎల్ఎస్ఐపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నవంబర్ 30 ఉదయం 10 గంటలకు తెలంగాణ ఐటీ కమ్యూనికేషన్ల శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా ప్రారంభిస్తారని తెలిపారు. ప్రసారాలు ఉదయం 10 గంటలకు టీ–సాట్ నిపుణ చానల్‌లో.. ఆదివారం సాయంత్రం విద్యా చానల్‌లో 7 గంటల నుంచి 8 గంటల వరకు ప్రసారమౌతాయని పేర్కొన్నారు. ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇదేవిధంగా కొనసాగే షెడ్యూల్‌ను యువత గుర్తించాలని సీఈవో సూచించారు.

రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేత

- గుంటూరు ఐదో అదనపు జిల్లా కోర్టు తీర్పు... నిందితులపై నేరాన్ని నిరూపించలేకపోయిన ప్రాసిక్యూషన్
- తీర్పు వెలువడగానే కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు..
- న్యాయం జరగలేదని.. గంగలో దూకడమే శరణం అంటూ ఆవేదన
- అన్ని ఆధారాలు సమర్పించాం.. అయినా కేసు కొట్టేశారు
- తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం.. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం.. పోలీసులు అప్పీలు చేయాలి: స్పెషల్ పీపీ



రిషితేశ్వరి కేసు కొట్టివేయడంతో కోర్టు ఆవరణలో విలపిస్తున్న రిషితేశ్వరి తల్లి దుర్గాభాయ్, ఆమె పక్కన తండ్రి మురళీకృష్ణ

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నగరంపాలెం: తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ (ఏఎన్‌యూ) ఆర్కిటెక్చర్ విద్యార్థిని ఎం. రిషితేశ్వరి ఆత్మహత్య కేసును కొట్టివేస్తూ గుంటూరు కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. వరంగల్‌కు చెందిన రిషితేశ్వరి గుంటూరు జిల్లా పెదకాకాని మండలం ఏఎన్‌యూలో బ్యాచ్‌లర్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (బీఆర్క్) చదువుతూ, 2015 జూలై 14న బాలికల వసతిగృహంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ర్యాగింగ్, వేధింపులవల్లే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతురాలి తల్లిదండ్రులు అప్పట్లో పెదకాకాని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అయితే, నిందితులపై మోపిన నేరాన్ని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోవడంతో కేసును కొట్టేస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా జడ్జి కె. నీలిమా తీర్పు వెలువరించారు.

కేసు పూర్వాపరాలు..

నిజానికి.. రిషితేశ్వరి ఆత్మహత్య ఘటన అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బీసీ సామాజికవర్గానికి చెందిన విద్యార్థిని బలవన్మరణానికి కారణమైన యూనివర్సిటీ అధికారులు, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా అప్పటి టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. విద్యార్థిని మృతికి కారణమైన అప్పటి ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.బాబురావుతో పాటు యూనివర్సిటీ ఉన్నతాధికారులపై కేసు నమోదు చేయాలని, ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిషితేశ్వరి కుటుంబానికి న్యాయం చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాలు పెద్దఎత్తున ఉద్యమం చేశాయి. చంద్రబాబు నిర్లక్ష్యం వీడాలని అప్పట్లో అసెంబ్లీలోనూ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు నాటి ప్రభుత్వం చేయని ప్రయత్నంలేదు. చివరికి.. ఈ పోరాటాల ఫలితంగా టీడీపీ ప్రభుత్వం విధిలేని పరిస్థితుల్లో ప్రిన్సిపాల్ జి. బాబురావుపై చర్యలు తీసుకుని, ఆరోపణలు ఎదుర్కొంటున్న విద్యార్థులను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో.. సుదీర్ఘకాలం విచారణ జరిగిన అనంతరం శుక్రవారం గుంటూరు కోర్టు కేసును కొట్టివేసింది. దీంతో.. తీర్పు వెలువడగానే రిషితేశ్వరి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

గుండె ఘోషకు రిషితేశ్వరి అక్షర రూపం ఇదే..

రిషితేశ్వరి ఆత్మహత్య తరువాత ఆమె గదిలో డైరీ లభించింది. అందులో రిషితేశ్వరి స్వహస్తాలతో రాసుకున్న కొన్ని ఘటనలు, తాను ఎదుర్కొన్న ఆవేదన, గుండెఘోషను కూలంకుషంగా అక్షర రూపంలో వివరించింది. 'మై లాస్ట్ నోట్'పేరుతో తన స్వహస్తాలతో రిషితేశ్వరి రాసిన కొన్ని ముఖ్యాంశాలు ఏమిటంటే..

- నవ్వు!!! నవ్వు!!! నవ్వు!!! ఈ నవ్వు అంటే నాకు చాలా ఇష్టం. అందుకే నేను ఎప్పుడూ నవ్వుతూ ఉంటా. అందరిని నవ్విస్తూ ఉంటా. కానీ, ఆ నవ్వే నాకు పెద్ద సమస్య అయింది.
- మా నాన్న అంటే నాకు చాలా ఇష్టం. నిజానికి పిచ్చి. అంత ప్రేమగా పెంచాడు మా నాన్న. నాకు చదువు అంటే ఇష్టం. ఈ చదువు కోసం నా ఊరు వదిలి ఇక్కడకొచ్చా.
- ఇలా వచ్చిన నన్ను.. నా సీనియర్స్‌లో కొంత మంది చదువు వైపు కాకుండా ప్రేమవైపు లాగడానికి ప్రయత్నించారు. నేను ఆ దారిలోకి వెళ్లలేదు. దాంతో నా మీద రూమర్స్ క్రియేట్ చేశారు. అది వింటేనే నా మొహంలో నవ్వు మాయమై పోయేది.. ఏడుపు కూడా వచ్చేది.
- నేను నాన్న దగ్గర ఏమీ దాచేదాన్ని కాదు.. కాని ఇక్కడకు వచ్చాక చెబితే ఏమైపోతారో అని దాయాల్సి వస్తోంది. నాకు నరకయాతన కనిపిస్తోంది.
- నా ఆఖరి కోరిక ఒక్కటే. నా చావుకు కారణం ఎవరో వాళ్లకు తెలుసు. వాళ్ల వాళ్ల తప్పు తెలుసుకుంటే చాలు. ఇంకెవ్వరినీ ఇలా (నాలా) బాధపెట్టకుంటే చాలు.
- ఏ అమ్మాయిలూ యూనివర్సిటీలో ర్యాగింగ్ ఉండదని అనుకోవద్దు. ఏ తల్లిదండ్రులు పిల్లల్ని ఇంత ప్రేమగా పెంచవద్దు. మీకు చెప్పలేక వాళ్లలో వాళ్లు దాచుకోలేక నరకం కనిపిస్తుంది.
- అమ్మా, నాన్న జాగ్రత్త! నాన్న ప్లీజ్ ఏడవకండి. నేను ఎప్పుడూ మీ దగ్గర్లోనే ఉంటా. ట్రై టూ డొనేట్ మై ఆర్గాన్స్ ఇఫ్ దే ఆర్ ఇన్ గుడ్ కండీషన్.. (నా అవయవాలు పనిచేసే స్థితిలో ఉంటే వాటిని దానం చేయడానికి ప్రయత్నించండి) అంటూ చాలా అంశాలు రాసింది.

డైరీలను పట్టించుకోలేదు..

కోర్టు తీర్పుతో మా ఆశలు చచ్చిపోయాయి. మాకు పూడ్చలేని బాధను మిగిల్చారు. న్యాయం జరుగుతుందని తొమ్మిదేళ్లుగా కోర్టుల చుట్టూ తిరిగాం. సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసు కొట్టేశామని చెప్పడం ఎంతో బాధగా ఉంది. మా కుమార్తె డైరీని స్వయంగా రాసింది. ఫోరెనిక్స్ ల్యాబ్ కూడా రిషితేశ్వరినే రాసిందని తేల్చిచెప్పింది. అయినా మా కుమార్తెకు అన్యాయం జరిగింది. ఇందులో 170 మంది సాక్షులున్నారు. కానీ, ఏ ఒక్కరూ వారికి కనిపించలేదు. మాకింక దిక్కెవరు? గంగలో దూకడమే శరణ్యం. పాప రాసిన డైరీలను ఎందుకు సాక్ష్యంగా తీసుకోలేదో అర్థంకావడంలేదు. గతంలో సీఎం చంద్రబాబు, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీకి డైరీ కాపీలు అందజేసినా పరిగణలోకి తీసుకోలేదు. హైకోర్టుకు వెళ్లే విషయాన్ని ఆలోచిస్తాం.

– రిషితేశ్వరి తల్లిదండ్రులు దుర్గాభాయ్, మురళీకృష్ణ, రాజమండ్రి

కోర్టులో అన్నీ సమర్పించాం, అప్పీలుకు వెళ్లాలి..

రిషితేశ్వరి డైరీల్లో ఎవరెవరు ర్యాంగింగ్‌కు పాల్పడ్డారు, మానసికంగా వేధించిన వారి పేర్లు స్పష్టంగా ఉన్నాయి. అవన్నీ కోర్టు ముందున్నాయి. తోటి విద్యార్థులు, సీనియర్లు ఎలా వేధించారో కూడా అందులో స్పష్టంగా ఉంది. ప్రిన్సిపాల్ బాబురావుకు రిషితేశ్వరి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అప్పట్లో హాయ్‌ల్యాండ్‌లో జరిగిన స్పెషల్ పార్టీలో లైంగికంగా వేధించారు. వీటన్నింటిని పరిగణలోకి తీసుకుంటే నిందితులకు శిక్షపడుతుందని భావించాం. కానీ, కోర్టు కేసును కొట్టేసింది. ఈ తీర్పు న్యాయమైంది కాదని భావిస్తున్నాం. హైకోర్టుకు వెళ్లే ఆలోచన చేస్తాం. పోలీసులు కూడా అప్పీల్ చేయాలి.

– స్పెషల్ పీపీ వై. కోటేశ్వరరావు

ఇది రెడ్ బుక్ పాలన

- ఏపీలో వ్యవస్థలన్నీ కూప్పకూలిపోయాయి
- కృష్ణా జిల్లా వైఎస్సార్‌సీపీ నేతల సమావేశంలో వైఎస్ జగన్ మండిపాటు
- సంక్రాంతి తర్వాత పార్లమెంట్ నియోజకవర్గం యూనిట్‌గా జిల్లాల్లో పర్యటిస్తా
- 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' పేరుతో కార్యక్రమం



అబద్ధాలు చెప్పడం మనకు చేతగాదు. అతి నిజాయితీ, అతి మంచితనం మనకున్న సమస్యలు. కానీ రేపు మనమనుకుంటున్న ఈ సమస్యలే మళ్లీ మనల్ని అధికారంలోకి తెస్తాయి. ఆరు నెలలు తిరక్క మునుపే ఇవాళ పరిస్థితి చూస్తే.. ప్రతి ఇంట్లో ఒకటే చర్చ జరుగుతోంది. జగన్ కనీసం పలావు అయినా పెట్టేవాడు.. చంద్రబాబునాయుడు బిర్యానీ పెడతానన్నాడు.. తీరా చూస్తే పలావు పోయింది, బిర్యానీ పోయిందని చర్చ జరుగుతోంది. – వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'రాష్ట్రంలో ఎక్కడ చూసినా రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోంది. ప్రజలకు మంచి చేశాం కాబట్టి మాకు ఓటు వేయండి.. అని అడిగే పరిస్థితి టీడీపీకి లేదు. ఎక్కడ చూసినా వ్యవస్థలన్నీ కుప్పకూలిపోయిన పరిస్థితే కనిపిస్తోంది' అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. 'మన ప్రభుత్వానికి, చంద్రబాబు ప్రభుత్వానికి మధ్య ఇప్పటికే ప్రతి ఇంట్లో పోలిక మొదలైంది. మన ప్రభుత్వ హయాంలో ఎలా ఉండేది.. ఈ ఆరు నెలల్లో చంద్రబాబు ప్రభుత్వం ఎలా పని చేస్తోంది.. అన్న చర్చ ప్రతి ఇంట్లో నడుస్తోంది' అని స్థానిక సంస్థల ప్రజానిధులకు చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, మేయర్లతో సమావేశమయ్యారు. సంక్రాంతి తర్వాత పార్లమెంటు యూనిట్‌గా జిల్లాల బాట పడతానని, దాదాపు జనవరి ఆఖరు నుంచి 'కార్యకర్తలతో జగనన్న.. పార్టీ బలోపేతానికి దిశా నిర్దేశం' అనే పేరుతో ఈ కార్యక్రమాన్ని మొదలు పెడతానని చెప్పారు. ప్రతి బుధవారం, గురువారం జిల్లాల్లోనే ఉంటానని, ప్రతి పార్లమెంటును ఒక యూనిట్‌గా తీసుకుని అక్కడకి వచ్చి బస చేస్తానన్నారు. బుధవారం మూడు నియోజకవర్గాల కార్యకర్తలతో, గురువారం మరో నాలుగు నియోజకవర్గాల కార్యకర్తలతో మమేకం అవుతానని చెప్పారు. పూర్తిగా కార్యకర్తలకే సమయం కేటాయిస్తానని, అక్కడే ఉంటూ వారితో మమేకమవుతూ, వారికి తోడుగా ఉంటూ వారికి మరింత దగ్గరయ్యే కార్యక్రమం చేస్తానని తెలిపారు. 'గ్రామ స్థాయిలో కార్యకర్త నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ప్రతి ఒక్కరికీ ఫేస్ బుక్, ఇన్‌స్టా, వాట్సాప్ ఉండాలి. ఎక్కడ ఏ అన్యాయం జరిగినా దాన్ని వీడియో తీసి అప్ లోడ్ చేయాలి. యూట్యూబ్‌లో కూడా పోస్ట్ చేయాలి. సంవత్సరం పూర్తయ్యే సరికి గ్రామంలో తెలుగుదేశం పార్టీని, చంద్రబాబును ప్రశ్నిస్తూ ప్రతి ఇంట్లోంచి వాయిస్ రావాలి. అది మనం చేస్తూ, మన కార్యకర్తలతో చేయించాలి. సూపర్ సిక్స్ ఏమైంది? ఏమైంది సూపర్ సెవన్? మాకు చెప్పిన మాటలు ఏమయ్యాయి? అన్న దగ్గర నుంచి మొదలయ్యే ప్రశ్నల వర్షం.. ఏమైంది మా స్కూల్? ఏమైంది మా హాస్పిటల్? ఏమైంది మా పంటల కొనుగోలు పరిస్థితి? ఏమైంది మా ఆర్బీకే? అంటూ ప్రశ్నల పరంపర కొనసాగాలి. ఆ దిశగా అడుగులు ముందుకు పడాలి' అని నిర్దేశించారు.

బాదుడే.. బాదుడు
ఇప్పుడు రూ. 9 వేల కోట్లు

- ఏపీ ప్రజలపై భారీగా విద్యుత్ చార్జీల భారం మోపుతున్న చంద్రబాబు... ఇదికాక ఇప్పటికే ఈ నెల బిల్లు నుంచి రూ.6,072.86 కోట్లు వసూలు
- ఇంధన సర్దుబాటు చార్జీల పేరుతో తాజాగా వడ్డన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

అభివృద్ధిలో భాగస్వాములవుదాం

- మంత్రి జూపల్లి కృష్ణారావు, మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు
- ముఖాముఖి చర్చావేదికలో పలు కీలక నిర్ణయాలు
- అలరించిన మ్యూజికల్ నైట్
- ముగిసిన ఆర్‌ఐడీ స్వర్ణోత్సవ వేడుకలు



ఆర్‌ఐడీ పాఠశాలలోని ప్రపంచ పటం నమూనాను తిలకిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్‌ఐడీ స్వర్ణోత్సవ వేడుకలు శుక్రవారం ముగిశాయి. స్థానిక రాజబంగ్లాలో ఏర్పాటు చేసిన వేడుకలనుద్దేశించి పలువురు వక్తలు మాట్లాడారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మైహోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, బిట్స్ పిలానీ వైస్‌చాన్స్‌లర్ వలిపె రాంగోపాల్‌రావు, హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కట్టా జయరాంరెడ్డితో ముఖాముఖి చర్చావేదిక ఏర్పాటు చేశారు. వీరంతా తమ పాఠశాల అనుభవాలను పూర్వ విద్యార్థులో పంచుకున్నారు. కొల్లాపూర్ అభివృద్ధిలో అందరం భాగస్వాములం అవుదామని పిలుపునిచ్చారు. స్వర్ణోత్సవాల సందర్భంగా భవిష్యత్ కార్యాచరణకు సంబంధించి పూర్వ విద్యార్థుల సలహాలు, సూచనలు స్వీకరించారు. గురువులు, కళాకారులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పలు రంగాల్లో రాణిస్తున్న వారికి ఆర్‌ఐడీ అవార్డులు అందజేశారు. ఆర్‌ఐడీ అల్యుమినీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సాయిప్రసాద్, కటికనేని మదన్ మోహన్‌రావు ఆర్‌ఐడీ పూర్వ విద్యార్థులను బ్యాచ్‌ల వారీగా సత్కరించారు.

మార్గదర్శకంగా నిలవాలి

ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాలు ప్రతిఒక్కరికీ మార్గదర్శకం కావాలని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పూర్వ విద్యార్థులు అందరినీ ఒకచోటకు చేర్చి వేడుక నిర్వహించడం శుభపరిణామం అని, వేడుకలను విజయవంతంగా నిర్వహించిన అల్యుమ్నీ కమిటీని అభినందించారు. కొల్లాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి పర్చేందుకు తనవంతు కృషిచేస్తానని, అందులో మీరు కూడా భాగస్వాములు కావాలని కోరారు.

అన్ని పార్టీల్లో నాకు మిత్రులు

నేను కుడికిళ్లలో 7వ తరగతి వరకు, 8 నుంచి ఇంటర్ వరకు ఆర్‌ఐడీలో చదువుకున్నానని జూపల్లి రామేశ్వర్‌రావు అన్నారు. ఉన్నత చదువులు హైదరాబాద్‌లో పూర్తిచేశానని చెప్పారు. నా కాళ్లపై నేను నిలబడేందుకు ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలనుకున్నా. కానీ.. అనుకోకుండా వ్యాపార రంగంలోకి ప్రవేశించి సక్సెస్ అయ్యానని పేర్కొన్నారు. వ్యాపార రంగంలో రాణించాలంటే అడ్డదారుల్లో వెళ్తుంటారని భావిస్తారు కానీ, నేను నిజాయితీగానే విజయవంతం అయ్యానన్నారు. 1991లో చినజీయర్‌స్వామితో ఏర్పడిన పరిచయం నా జీవితాన్ని పూర్తిగా ఆధ్యాత్మికం వైపు మళ్లించిందన్నారు. గత ఏళ్లుగా రాజ్యసభ సీటు ఇచ్చేందుకు పలు పార్టీలు ముందుకు వచ్చాయని, కానీ, తాను రాజకీయ రంగం వైపు రావాలనుకోవడం లేదన్నారు. తనకు అన్ని పార్టీల్లో మిత్రులు ఉన్నారని వెల్లడించారు.

ఆదర్శంగా వేడుకలు

నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి ఆర్‌ఐడీ స్వర్ణోత్సవ వేడుకలకు శుక్రవారం హాజరయ్యారు. అంతకు ముందు జూపల్లి రామేశ్వర్‌రావును కుడికిళ్లలోని ఆయన నివాసం వద్ద కలిశారు. వేడుకల్లో మల్లురవి మాట్లాడుతూ వేలాది మంది పూర్వ విద్యార్థులు ఒకచోట సమావేశం కావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగం అభివృద్ధికి కృషిచేస్తోందని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు..

ఆర్‌ఐడీ స్వర్ణోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన మ్యూజికల్ నైట్ అలరించింది. ప్రముఖ సంగీత డైరెక్టర్ తమన్, డ్రమ్స్ వాయిద్యకారుడు శివమణి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పలువురు గాయకులు పాటలు పాడి అలరించారు. రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, మై హోమ్స్ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు, ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, మధుసూదన్‌రెడ్డి, మేఘారెడ్డి, వాకిటి శ్రీహరి, వంశీకృష్ణ తదితరులు మ్యూజికల్ నైట్ తిలకించారు. మంత్రులు వేదికపై స్టెప్పులేశారు.



తమన్ బృందం ప్రదర్శన

మైలారం గుట్టను సంరక్షిస్తాం



మాట్లాడుతున్న పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

బల్మూర్: మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రాణ త్యాగానికైనా సిద్ధంగా ఉండాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ. లక్ష్మణ్ గ్రామస్తులకు పిలుపునిచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం మైలారం గ్రామాన్ని అనుసరించి ఉన్న గుట్టపై మైనింగ్ తవ్వకాలు ప్రారంభం కావడంతో శుక్రవారం పౌరహక్కుల సంఘంతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా తవ్వకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వడం సరికాదన్నారు. గుట్టపై ఆధారపడి ఐదు గ్రామాల ప్రజలు జీవిస్తున్నారని.. తవ్వకాలతో గుట్ట పూర్తిగా కనుమరుగై గ్రామంలోని ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మైలారం గుట్టపై మైనింగ్ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ అధ్యక్షుడిగా గుండాల వెంకటేశ్వర్లుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలయ్య, వివిధ సంఘాల నేతలు లక్ష్మీనారాయణ, చంద్రమౌళి, గ్రామపెద్దలు లింగయ్య, బంగారయ్య, అనిల్, దేవస్వామి, సత్యంగౌడ్, రమేష్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

టైల్‌పాండ్ నిర్మాణంతో విశేష ప్రయోజనాలు

దోమలపెంట: తెలంగాణ రాష్ట్రానికి కీర్తి కిరీటం, ఆధునిక దేవాలయంగా వెలుగొందుతున్న శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ కేంద్రంలో టైల్‌పాండ్ (వియర్ సైట్) నిర్మాణం పూర్తి చేసి, వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకుంటేనే రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)పై కొంత మేరకన్నా ఆర్థిక భారం తగ్గుతుందని సీఐటీయూ, శ్రీశైలం ప్రాజెక్టు, రాష్ట్ర నాయకులు వి.కిషన్ అన్నారు. శుక్రవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ.. ఒకవైపు రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం, మరోవైపు శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయం నుంచి నీటిని జల విద్యుదుత్పత్తికి వినియోగించవద్దని కృష్ణా బోర్డు రెండు తెలుగు రాష్ట్రాలకు లిఖితపూర్వకంగా ఆదేశాలు జారీ చేయడంతో ప్రస్తుతం డిస్కంపై ఆర్థిక భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జెన్‌కో యాజమాన్యం వాస్తవ పరిస్థితులపై దృష్టిసారించి భూగర్భ కేంద్రం వనరులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భూగర్భ కేంద్రం 365 రోజులు విద్యుదుత్పత్తి చేయడం కోసం 2003–04 సంవత్సరంలో ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో శ్రీశైలం ఆనకట్ట దిగువన సాగర్ జలాశయంలో శ్రీశైలం డ్యాం నుంచి సుమారు 15 కిలోమీటర్ల దూరంలో పరుపుల బండ వద్ద కృష్ణానదిపై టైల్‌పాండ్ (వియర్ సైట్) నిర్మాణం చేపట్టిందన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత టైల్‌పాండ్‌కు దిగువన పునాది ప్రాంతంలో నీటి తాకిడికి కొట్టుకుపోయిందన్నారు. ఆ తర్వాత నిర్మాణంపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో డిస్కంలపై భారం పడుతుందన్నారు. టైల్‌పాండ్ నిర్మాణం పూర్తయితే శ్రీశైలం డ్యాం దిగువన నాగార్జునసాగర్ జలాశయంలో భూగర్భ కేంద్రంకు ఒకటిన్నర టీఎంసీల నీరు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటుందన్నారు. దీంతో విద్యుత్ డిమాండ్ లేని సమయంలో రాత్రివేళ భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో సాగర్ జలాశయంలో నీటిని శ్రీశైలంలోకి ఎత్తిపోసి విద్యుత్ డిమాండ్ ఉన్న సమయంలో కేంద్రంలో విద్యుదుత్పత్తి చేసుకోవచ్చన్నారు. ఎన్నో విశాల ప్రయోజనాలున్న టైల్‌పాండ్ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పూర్తిచేయాలని ఆయన కోరారు.



శ్రీశైలం డ్యాం దిగువున 15 కి.మీ. దూరంలో కృష్ణానదిపై నిర్మిస్తున్న టైల్‌పాండ్ (ఫైల్)

విద్యా విధానంలో మార్పునకు కృషి

రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



మన్ననూర్ పీటీజీ పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మన్ననూర్: విద్యా విధానంలో సమూలమైన మార్పులు తీసుకొచ్చేందుకు అందరి సహకారం అవసరమని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం మన్ననూర్ గిరిజన ప్రాథమిక పాఠశాల, ఆదివాసి గిరిజన (పీటీజీ) పాఠశాలను ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ, డీఎఫ్ఓ రోహిత్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఆయా పాఠశాలల పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించి గిరిజన ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం ప్రిన్సిపాల్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ ఉండాలంటే ఎలాంటి సౌకర్యాలు అవసరమని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడతానని చెప్పారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలను ప్రభుత్వం పెంచిందని.. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో గిరిజన ఆర్సీఓ కళ్యాణి, ఐటీడీఏ ఏఓ జాఫర్ హుస్సేన్, అచ్చంపేట్ ఎంఈఓ బాలకిషన్, పీటీజీ ప్రిన్సిపల్ గోవర్ధన్, హెచ్‌ఎం ఇందిరాగాంధీ, డీఈ వెంకటేశ్వరసింగ్, రఘు, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి..

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లోని విద్యార్థులకు అందిస్తున్న భోజనంలో నాణ్యత పాటించాలని, మెనూలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల, ఎమ్మార్సీలోని ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంట గదుల్లోని కూరగాయాలను ఆయన పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, గదుల వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని, నిత్యావసర సరుకులు, కూరగాయలు, బియ్యం నాణ్యతగా ఉండేలా చూడాలన్నారు. వంట కార్మికులు పాత్రలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్ బిల్లుల గురించి వంట కార్మికులను అడిగి తెలుసుకున్నారు. కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు.

నాణ్యమైన విద్యే లక్ష్యం..

పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యాశాఖ కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి పేర్కొన్నారు. శుక్రవారం వెల్దండలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లాల్లోని పాఠశాలలను పరిశీలిస్తున్నామని.. ఇప్పటి వరకు సంగారెడ్డి, వికారాబాద్, సిద్దిపేట, నాగర్‌కర్నూల్‌లోపర్యటించినట్లు తెలిపారు. గదుల కొరత లేకుండా చూస్తామని.. పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదిక అందిస్తామన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ డీఈఓ రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు, వెంకటేశ్వర్లశెట్టి, హెచ్‌ఎంలు సుగుణ, పావని, రవీందర్, కస్తూర్బాగాంధీ విద్యాలయ ప్రిన్సిపల్ స్రవంతి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.